క్లుప్తంగా

శాస్త్రోకంగా ముహూర్తపురాట



కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు,అతిథులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు ఇందిరా కాలనీలో కొలువుదీరిన నూకాలమ్మ అమ్మవారి పండగకు సంబంధించి సోమవారం ముహూర్తపు రాటను శాస్త్రోక్తంగా వేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహిళలు,గ్రామస్తులు పాల్గొన్నారు. వచ్చే వారం కొత్త అమావాస్య సందర్భంగా నూకాలమ్మ తల్లి పూజలను ఇక్కడ నెల రోజుల పాటు నిర్వహిస్తారు. రోజూ ప్రత్యేక పూజలు,వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. ముమూర్తపు రాట అనంతరం పల్లకీలో అమ్మవారి పాదాలను పుర వీధుల్లో తిప్పారు. నాయకులు శంకర్,మూగి సూర్యనారాయణ, పెతకంశెట్టి శ్యామ్,మళ్ల ధనలత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నూకాంబిక అమ్మవారి పండగ



నూకాంబిక అమ్మవారు

గోపాలపట్నం: గోపాలపట్నం ప్రాంతవాసుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న నూకమాంబిక అమ్మవారి పండగ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఈమేరకు ఆలయ ప్రాంగణాన్ని ముస్తాబు చేశారు. ఈ నెల 28న అమ్మవారి ప్రతిమల ఊరేగింపు భక్తి శ్రద్ధలతో జరుపుతామని ఆలయ ధర్మకర్త మళ్ల సతీష్ తెలిపారు. 29న ప్రధాన పండగ జరుగుతుందని దీని కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

జక్కంపూడి రాజాకు సాదర స్వాగతం



విమానాశ్రయంలో జక్కంపూడి రాజాకు స్వాగతం పలుకుతున్న దొడ్డి కిరణ్

గోపాలపట్నం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు విశాఖ విమానాశ్రయంలో ఆత్మీయ స్వాగతం లభించింది. జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు దొడ్డి కిరణ్ విమానాశ్రయంలో పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించారు. ఆయనతో పాటు సౌత్ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు శ్రీనివాసరావు, నార్త్ యువజన విభాగం అధ్యక్షుడు రవితేజ, యవకులు శ్యామ్, గణేష్, ఉమ తదితరులు పాల్గొన్నారు.

ఎం.ఎన్.శాస్త్రి జీవితం ఆదర్శనీయం



ఐఐటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణరావును సత్కరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: విశిష్ట పరిశోధకుడిగా, పరిపాలన దక్షుడిగా జాతీయ స్థాయిలో అవార్డులు పొందిన ఆచార్య ఎం.ఎస్.శాస్త్రి జీవితం నేటి యువతకు స్ఫూర్తిని కలిగిస్తుందని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో సోమవారం ఆచార్య ఎం.ఎస్.శాస్త్రి స్మారక ఉపన్యాసం ఏర్పాటు చేశారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. వీసీ మాట్లాడుతూ ఆచార్య ఎం.ఎస్ శాస్త్రి స్మారక ఉపన్యాసం నిర్వహించడం, ఈ కార్యక్రమ ఏర్పాటుకు విభాగం చొరవ తీసుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. సుదీర్ఘ కాలం అత్యుత్తమ సేవలు అందించిన వారిని గుర్తు చేసుకోవడం, నేటితరం యువతకు వీరిని పరిచయం చేయడం ముదావహమని చెప్పారు. ఉత్సుకత వ్యక్తి ప్రగతికి ప్రేరణ శక్తిగా నిలుస్తుందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ–కాన్పూర్) రసాయన శాస్త్ర విభాగ ఆచార్యుడు ఎం.లక్ష్మీనారాయణరావు ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు పాల్గొన్నారు.

ఇదేనా చెత్తశుద్ధి!



గోపాలపట్నం ఇందిరానగర్ సచివాలయాల సమీపంలో చెత్త పోగు

వీధుల్లో చెత్త పోగులు

పలు వీధుల్లో చెత్త పోగులు దర్శనమిస్తున్నాయి. పలు చోట్ల డంపర్ బిన్లు ఉన్నా అందులో చెత్త వేయడం లేదు. బయట గుట్టలుగా చెత్తపేరుకుపోతుంది.



శ్మశానం వెనుక రోడ్డు పక్కనే చెత్త



పాతగోపాలపట్నం వెళ్లే రోడ్డులో ..

ఓటీపీ చెబితే చాలు.

స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేపై ప్రజలకు అవగాహన ఉండడం లేదు. అసలు ఆ యాప్‌లో ఏముందో ప్రజలకు వివరించడం లేదు. వారి సెల్ ఫోన్లు ఓపెన్ చేసేసి ఓటీపీ చెబితే చాలు మీరిక వెళ్లిపోవచ్చని చెబుతున్నారు. అలా సర్వే ముగిస్తున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజలను భాగస్వామ్యం చేయాలని.. తడి చెత్త పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలని.. మన చుట్టు పక్కల ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యాలు బాగుంటాయని ఇలా పలు అంశాలు యాప్‌లో పొందుపరిచారు. దీనిపై అవగాహన కల్పిస్తే భవిష్యత్తులోనైనా ఉపయోగపడుతోందని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు.

ప్లాస్టిక్‌కు స్వస్తి చెబుదాం.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి స్వచ్ఛతలో విశాఖను నంబర్–1 స్థానంలో నిలబెడదాం.. ఇదీ ప్రచార మాధ్యమాలు.. సోషల్ మీడియాలో జీవీఎంసీ చేస్తున్న ప్రచారం.. క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పారిశుధ్య సిబ్బంది కొరత వేధిస్తోంది. అవసరమైన సామగ్రి అంతంతమాత్రమే. వీధుల్లో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి.

గోపాలపట్నం: స్వచ్ఛసర్వేక్షణ్ పేరుతో మెయిన్‌రోడ్లపై చెత్తాచెదారాలు ఎత్తి వీధులు, గల్లీలను నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో జీవీఎంసీ అధికారుల్లో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై చిత్త శుద్ధి కరువైందని పలువురు ఆరోపిస్తున్నారు. అంతా తూతూమంత్రంగా చేస్తున్నారని వాపోతున్నారు. శివారు ప్రాంతాలను జోన్ స్థాయి అధికారులు పరిశీలించిన పాపాన పోలేదని వాపోతున్నారు. గతంలో జోన్ కమిషనర్ రోజుకో ప్రాంతానికి వెళ్లి ఆ ప్రాంతంలో పారిశుధ్యంతో పాటు ఇతర సమస్యలు పరిశీలించే వారు. దీని వల్ల ఆ ప్రాంత వాసులతో పాటు ఇతర ప్రాంతాల వారికి అక్కడి సమస్య గురించి అవగాహన కలిగేది. ఇప్పుడు ఫొటోలు తీసి అప్‌లోడ్‌చేస్తే చాలన్నట్టుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. సమస్యలు చెప్పుకునేందుకు సోమవారం వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని మండిపడుతున్నారు.

పనిముట్ల కొరత

పారిశుధ్య కార్మికులకు పనిముట్ల కొరత వెంటాడుతోంది. వారికి చీపుర్లు, చెత్త ఎత్తుకునే బేషిన్లు లేవు. అంతే కాదు కనీసం గ్లౌజులు, గమ్ బూట్లు లేని పరిస్థితి ఉందని చెబుతున్నారు. పనిముట్లు లేకపోవడం వల్ల పలువురు పారిశుధ్య కార్మికులు గాయాలపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాక్షిక ప్రయోజనం కోసమే..

అధికారులూ ఆలోచించండి.. పాక్షిక ప్రయోజనాల కోసం ఆత్ర పడవద్దని, శాశ్వత ప్రయోజనాల కోసం పని చేద్దామని పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద సేవకులు కోరుతున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌ను నీరుగార్చేవిధంగా చేయవద్దని, ప్రజల విశ్వాసం సన్నగిల్లనివ్వొద్దని కోరుతున్నారు.

క్షయను నిర్లక్ష్యం చేయవద్దు



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ మట్టా శశి ప్రియాంక

కంచరపాలెం: మందులు వాడితే పూర్తిగా నయమయ్యే క్షయను నిర్లక్ష్యం చేయవద్దని యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మట్టా శశిప్రియాంక అన్నారు. ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం 'క్షయ వ్యాధిని మనం అంతమొందించగలం'అనే నినాదంతో నిర్వహించిన ర్యాలీని డాక్టర్ శశి ప్రియాంక ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమాల చేపట్టాయన్నారు. మనందరి పంతం–టీబీ అంతం' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించి వార్డులో ప్రజలకు అవగాహన కల్పించారు. నాల్కో కంపెనీ ఆర్థిక సహాయంతో పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ, ఎస్‌టీఎల్‌ఎస్ శరత్, టీబీ హెచ్‌వీ నూనెల పైడిరాజు, ఎల్‌టీ పూర్ణిమ, టీబీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, ఆరోగ్యకేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

నేలకొరిగిన భారీ వృక్షం

తప్పిన పెనుప్రమాదం



నేలకొరిగిన భారీ వృక్షాన్ని తొలగిస్తున్న సిబ్బంది

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి జయేంద్ర కాలనీ ప్రధానమార్గంలో భారీ వృక్షం సోమవారం ఉదయం ఒక్కసారిగా నేలకొరిగింది. ఆ సమయంలో చుట్టు పక్కల పరిసరాల్లో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే ట్రాన్స్‌ఫార్మర్ తీగలకు కొమ్మలు తగలడంతో షార్ట్ సర్క్యూట్ అయ్యి ట్రాన్స్‌ఫార్మర్ ట్రిప్ అయింది. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అదే మార్గాన యారాడ గ్రామానికి వెళ్లే ఆర్టీసీ బస్సులో వివిధ పనులపై వెళ్లే వారు ఇబ్బందులకు గురయ్యారు. హుటాహుటిన వృక్షాన్ని తొలగించి గంటల వ్యవధిలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. కార్పొరేటర్ గల్లా చిన్నా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, స్థానిక ప్రజలు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

అంధకారంలో సర్వీసురోడ్డు



సేవా మార్గంలో వెలగని వీధి లైట్లు

ఫోకస్

జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం హనుమాన్ ఆలయం వెనుక మార్గంలో పూర్తిగా అంధకారం నెలకొంది. ఈ మార్గంలో వీధి లైట్లు వెలగక పోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. రెండు వారాల నుంచి సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ఈ మార్గాన రాకపోకలు సాగించేవారు అవస్థలు పడుతున్నారు.

– మల్కాపురం

జోన్-5కు ఒకటే వినతి



అర్జీ పరిశీలిస్తున్న జోన్-5 కమిషనర్ రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి ఒకే ఒక్క వినతి అందింది. జోనల్ కమిషనర్ బి.రాము మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ విభాగానికి ఒక ఫిర్యాదు అందినట్లు తెలిపారు. ప్రజా ఫిర్యాదులను తక్షణం పరిష్కరిస్తామన్నారు. రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, దిలీప్‌కుమార్, ఏపీడీవోలు కృపానందం, పుణ్యవతి, టౌన్ ప్లానింగ్ టీపీవో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

సందడిగా ఇఫ్తార్ విందు



ముస్లింలతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్‌లో సోమవారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందు ఉత్సాహంగా సాగింది. ఎమ్మెల్యే గణబాబు, కార్పొరేటర్ గల్లా చిన్నాకు ముస్లిం పెద్దలు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. అనంతరం ముస్లింలతో నమాజ్ చేసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ మసీదులో ఇమామ్ నిర్వహించే వారికి ప్రభుత్వం నుంచి తోడ్పాటు అందిస్తామన్నారు. సమాజ శ్రేయస్సు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయాలని కోరారు. ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ మసీదు నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

ఉన్నత విద్యలో విలువలకు ప్రాధాన్యం



కార్యక్రమంలో పాల్గొన్న ఏయూ రెక్టార్ ఆచార్య కిషోర్‌బాబు తదితరులు

మల్కాపురం: విద్యార్థులకు అర్థమయ్యేలా అధ్యాపకులు బోధన సాగించాలని ఏయూ రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో సోమవారం అకడమిక్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యలో విలువలకు, నైపుణ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఏయూ గణిత శాస్త్ర అధ్యాపకుడు ఆచార్య నానాజీ, విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆర్.సుందరరామం,సెయింట్ ఆన్స్‌ాస్పత్రి వైద్య నిపుణుడు శంభుదత్త,హెచ్‌పీసీఎల్ మానవ వనరుల విభాగ మేనేజర్ భారతి తదితరులు పలు అంశాలపై ప్రసంగించారు. వివిధ విభాగాల అధిపతులు వారి సబ్జెక్టుల నివేదికలను సమర్పించారు.బోధన,పరిశోధన,సామాజిక కార్యక్రమాల నిర్వహణ,సెమినార్లు–వర్క్ షాప్‌ల నిర్వహణ,పరిశోధన పత్రాల సమర్పణ తదితర విషయాల్లో కళాశాల సాధించిన ప్రగతిపై చర్చించారు.

విద్యార్థుల ఉజ్వల భవితకు గ్రంథాలయాలు దోహదం

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల లైబ్రేరియన్ల వర్క్‌షాప్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవితకు గ్రంథాయాల సేవలు ఎంతో దోహదపడతాయన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ చీఫ్ లైబ్రేరియన్ ప్రొఫెసర్ పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రంథాలయాల ఆవశ్యకతను తెలియజేశారు. నేటి డిజిటల్ యుగంలో గ్రంథాలయాల పాత్ర, ఉపయోగించాల్సిన వివిధ రకాల సాఫ్ట్‌వేర్‌ల గురించి వివరించారు. సెంటర్ గాంధీనగర్ అహ్మదాబాద్‌కు చెందిన సైంటిస్ట్ హేమ చోలిన్ రిసోర్స్ పర్సన్‌గా విచ్చేసి గ్రంథాలయాలను డిసిప్టలైజేషన్ చేయడంలో ఉపయోగించే సాఫ్ట్‌వేర్ గురించి పూర్తిస్థాయిలో గ్రంథాలయ అధికారులకు అవగాహన కల్పించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరించిన కృష్ణా కళాశాల గ్రంథాలయ అధికారి డాక్టర్ ఎం.శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ వర్క్‌షాప్‌కు రాష్ట్ర వ్యాప్తంగా 40 మంది లైబ్రేరియన్లు హాజరయ్యారని తెలిపారు. కళాశాలల గ్రంథాలయాలు విద్యార్థులకు అందిస్తున్న వివిధ సేవలను గురించి తెలియజేస్తూ, గ్రంథాలయం డిజిటలైజేషన్ చేయడంతో సేవలు మరింత చేరువవుతున్నాయన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు పాపం కూటమిదే



నిరసన ర్యాలీలో పాల్గొన్న అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు

- స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించాలి
- ఎన్నికల ముందు బాబు, పవన్ ఇచ్చిన వాగ్దానాలు మరిచారా?
- అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకుల మండిపాటు

మల్కాపురం: తాము అధికారంలోకి వస్తే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పలు సభల్లో చేసిన వాగ్దానాలను గుర్తు చేసుకోవాలని కార్మిక ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ఎం.జగ్గునాయుడు, ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం,వైఎస్సార్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అనీల్‌కుమార్ అన్నారు. నేడు ప్లాంట్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తుంటే ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ సోమవారం నిరసన ర్యాలీ చేపట్టారు. హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు నుంచి మల్కాపురం వరకు సాగిన ర్యాలీలో అఖిలపక్షాల కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ పరిశ్రమలను ప్రైవేటీ కరణ చేయాలనే యోచనతో ఎప్పుడూ పని చేస్తుందని మండిపడ్డారు.వారి ఆలోచనలకు టీడీపీ,జనసేన మద్దతు ఇవ్వడం చాలా బాధాకరం అన్నారు. పలు చోట్ల గల ఉక్కు పరిశ్రమలను సొంత గనులు ఇచ్చిన కేంద్రం విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేటాయించకపోవడం వెనుక రహస్యం ఏంటిని ప్రశ్నించారు. ప్లాంట్‌లో పని చేస్తున్న సుమారు 960 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం వల్ల వారి కుటుంబాలు నేడు రోడ్డున పడ్డాయన్నారు. ఈ పాపం ముమ్మాటికీ కూటమి సర్కార్‌దే అని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ సాధనకు ఎంతో మంది ప్రాణత్యాగం చేశారని,వారి ప్రాణత్యాగాలు కూటమి నాయకుల చేతగాని తనం వల్ల వృథా అవుతున్నాయని మండిపడ్డారు.కూటమి నేతలకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే కార్మికుల తొలగింపును అడ్డుకోవాలని, సొంత గనులు కేటాయించే విధంగ చూడాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా నాయకుడు గుడాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న దేవర అప్పలరాజుయాదవ్

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పలు ప్రభుత్వ,ప్రైవేట్ పరిశ్రమల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అందడం లేదని విశాఖ ఇండస్ట్రియల్ ఏరియా కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ అధ్యక్షుడు దేవర అప్పలరాజుయాదవ్ ఆరోపించారు. 59వ వార్డు నక్కవానిపాలెంలోని యూనియన్ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హెచ్‌పీసీఎల్,షిప్‌యార్డ్, ఎస్‌ఆర్,ఎస్‌బీసీ,డాక్‌యార్డ్,అలూఫ్లోరైడ్ తదితర పరిశ్రమల్లో వేలాది మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారని వివరించారు. కాంట్రాక్టర్లు కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ యాక్ట్ ప్రకారం కనీస వేతనం నేటికీ ఇవ్వడం లేదన్నారు. కార్మికులకు ఆయా పరిశ్రమలు కనీస వసతులు కల్పించడం లేదని.. అయినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు తక్షణమే స్పందించి కార్మికులకు కనీస వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు, ఎల్‌జీ పాలిమర్స్ డైరెక్టర్ చియోన్ కిజంగ్

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురంలో సోమవారం ఎల్జీపాలిమర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరం ఐదురోజుల పాటు కొనసాగుతుందని వెల్లడించారు. ఎల్జీపాలిమర్స్ యాజమాన్యం ఇటీవల రూ.10వేల చొప్పున సుమారు రూ. 66 కోట్ల మేర బాధితులకు అందించిందని తెలిపారు. ఎల్జీ పాలిమర్స్ సంస్థ డైరెక్టర్ చియోన్ కిజంగ్ మాట్లాడుతూ ఎల్‌జీ ఇండియా సీఎస్‌ఆర్ ఫౌండేషన్ ద్వారా మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నామన్నారు. శిబిరంలో ఊపిరితిత్తులు, చర్మ వ్యాధుల వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారన్నారు. వైద్యబిరానికి ఇండస్ యాజమాన్యం తమ సహకారం అందించిందని తెలిపారు. కార్యక్రమంలో ఇండస్ ఆస్పత్రి సీఈవో చంద్రమౌళీశ్వరరావు, వైద్యులు డాక్టర్ అనంతలక్ష్మి, జి. శ్రావణి, లక్ష్మోజీ, ఎల్‌జీ పాలిమర్స్ ప్రతినిధి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కేసు ఉపసంహరించుకోవాలని ధర్నా



ఎన్ఏడీ మెయిన్ గేటు వద్ద ధర్నా చేస్తున్న సీఈ యూనియన్ నాయకులు

గోపాలపట్నం: ఎన్ఏడీ ఉద్యోగులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎన్ఏడీ సీఈ యూనియన్ ఆధ్వర్యంలో సాకేతపురం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఎన్ఏడీ మెయిన్ గేటు వద్ద ధర్నాలో సీఈ యూనియన్ ప్రధాన కార్యదర్శి రుత్తల శ్రీనివాసరావు మాట్లాడుతూ మాట్లాడుతూ 90 రోజుల పాటు సుదీర్ఘంగా పోరాటం చేసి సస్పెండ్ అయిన వారిని విధుల్లోకి తెచ్చుకున్నామన్నారు. అలాగే అకారణంగా ఆరుగురు ఉద్యోగులపై పెట్టిన కేసు ఉపసంహరించుకోవాలని కోరారు. లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఈ యూనియన్ ప్రెసిడెంట్ పి నూకరాజు, వర్క్స్ కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

బీఈడీ పరీక్ష కేంద్రం తనిఖీ



పరీక్ష కేంద్రంలో డీన్ కేశవరావు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ విద్యా విభాగంలో బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ మూడో సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. వీటిని సోమవారం యూనివర్సిటీ పీజీ పరీక్షల డీన్ ఆచార్య కేశవరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు.